# సామాన్యుడికి కార్పొరేట్ వైద్యం..

- కొత్తగూడెంలో ఉచిత 'వెరికోస్ వీన్' శిబిరం సక్సెస్!
- ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు దారా రమేశ్ ఆధ్వర్యంలో బృహత్తర సేవాయజ్ఞం
- సుశ్రుత ఫౌండేషన్, ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సంయుక్త సౌజన్యంతో మెగా హెల్త్ క్యాంప్
- జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన ఎమ్మెల్యే కూనంనేని, మేయర్ మూడు గణేష్, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా
- ఖరీదైన వైద్యం ఉచితంగా అందడంపై సర్వత్రా హర్షాతిరేకాలు




భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే24(నినాదం)

సాధారణ పేద, మధ్యతరగతి ప్రజలకు సైతం అత్యంత ఖరీదైన కార్పొరేట్ స్థాయి వైద్య సేవలను ఉచితంగా అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ అధ్యక్షులు, ప్రముఖ వ్యాపారవేత్త దారా రమేశ్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత 'వెరికోస్ వీన్' (నరాల వాపు సమస్య) వైద్య పరీక్షలు, చికిత్సా శిబిరం అత్యంత ఘనంగా, విజయ వంతంగా ముగిసింది.

సుశ్రుత ఫౌండేషన్, ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్ సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక లక్ష్మీదేవిపల్లి మండలంలోని 'దారా ఫంక్షన్ హాల్' వేదికగా ఆదివారం ఈ మెగా హెల్త్ క్యాంప్‌ను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో దాదాపు 5వేల విలువ చేసే వాస్క్యులర్ సర్జన్ కన్సల్టేషన్, కలర్ డోప్లర్ స్క్రీనింగ్ టెస్ట్ ఉచితంగా చేసారు. ఈ వైద్య శిబిరంలో సుమారు 300 మంది ఉచితంగా పరీక్షలు చేసుకోవడం జరిగింది. ఈ బృహత్తర సేవా కార్యక్రమానికి కొత్తగూడెం శాసనసభ్యులు కూనమనేని సాంబశివరావు, సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, కొత్తగూడెం నగర మేయర్ మూడు గణేష్, స్థానిక పోలీస్ అధికారులు, ప్రజాప్రతినిధులు ముఖ్య అతిథులుగా హాజరై, జ్యోతి ప్రజ్వలన చేసి శిబిరాన్ని అధికారికంగా ప్రారంభించారు.

### దారా రమేశ్ సేవా నిరతి అమోఘం : ఎమ్మెల్యే

### కూనమనేని ప్రశంసలు

శిబిరాన్ని ప్రారంభించిన అనంతరం కొత్తగూడెం ఎమ్మెల్యే కూనమనేని సాంబశివరావు మాట్లాడుతూ.. మారుతున్న ఆధునిక జీవనశైలి, నిలబడి పని చేసే వృత్తుల కారణంగా నేడు చాలామంది 'వెరికోస్ వీన్' (కాళ్ల నరాలు ఉబ్బిపోవడం, రక్తం గడ్డకట్టడం) సమస్యతో తీవ్రంగా బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్పొరేట్ ఆసుపత్రులలో దీని నిర్ధారణకు, చికిత్సకు వేలాది రూపాయల ఖర్చవుతుందని, అలాంటి సంక్లిష్టమైన వైద్యాన్ని సామాన్యుడి ముంగిటకు తెచ్చిన దారా రమేశ్ సేవా నిరతి అమోఘమైనదని కొనియాడారు. సిపిఐ జిల్లా కార్యదర్శి షాబీర్ పాషా, మేయర్ మూడు గణేష్ మాట్లాడుతూ.. సమాజంలో సంపద సృష్టించేవారు చాలామంది ఉంటారని, కానీ అందులో కొంత భాగాన్ని సమాజ శ్రేయస్సు కోసం, ముఖ్యంగా పేదల ఆరోగ్యం కోసం ఖర్చు చేసే గుణం కొందరికే ఉంటుందని, అలాంటి వారిలో దారా రమేశ్ ముందు వరుసలో ఉంటారని ప్రశంసించారు.

### కిక్కిరిసిన దారా ఫంక్షన్ హాల్.. కదిలివచ్చిన రోగులు

శిబిరం నిర్వహించిన దారా ఫంక్షన్ హాల్‌కు కొత్తగూడెం నియోజకవర్గంతో పాటు జిల్లాలోని నలుమూలల నుండి వందలాది మంది రోగులు ఉదయాన్నే తరలివచ్చారు. ఏషియన్ వాస్కులర్ హాస్పిటల్‌కు చెందిన నిపుణులైన ప్రత్యేక వైద్య బృందం అత్యాధునిక స్క్రీనింగ్ పరికరాలతో రోగులకు పరీక్షలు నిర్వహించారు. వ్యాధి తీవ్రతను బట్టి ఉచితంగా మందులను పంపిణీ చేయడంతో పాటు, భవిష్యత్తులో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై రోగులకు వైద్యులు ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీదేవిపల్లి సీఐ వెంకటేశ్వర్లు, సీఐ కరుణాకర్, ఎస్ఐ రమణారెడ్డి, ప్రశాంతినగర్ సర్పంచ్ అజ్మీర లైలా, లోతువాగు ఉపసర్పంచ్ పాషా, ప్రముఖ నాయకులు బిర్లా తదితర అధికార, రాజకీయ ప్రముఖులు పాల్గొని వైద్య సేవలను పరిశీలించారు.

### విజయవంతం చేసిన ఆర్యవైశ్య సంఘ నాయకులు

ఈ మెగా వైద్య శిబిరాన్ని క్షేత్రస్థాయిలో పర్యవేక్షించి, ఎలాంటి లోటుపాట్లు లేకుండా విజయవంతం చేయడంలో ఆర్యవైశ్య ప్రముఖులు కీలక పాత్ర పోషించారు. ముఖ్యంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఆర్యవైశ్య మహాసభ గౌరవాధ్యక్షులు పెండ్యాల విజయభాస్కర్, ప్రధాన కార్యదర్శి యెలుగూరి నగేష్ కుమార్, ఉపాధ్యక్షులు దారా ధీరజ్, తేరాల వీరభద్రం, వారణాసి సురేష్, కాపుగంటి గుప్తా గారు డైమండ్ రావు తదితరులు రోగులకు అవసరమైన సదుపాయాలను దగ్గరుండి చూసుకున్నారు. ఇంతటి భారీ ఉచిత వైద్య శిబిరాన్ని తమ ప్రాంతంలో ఏర్పాటు చేసి, తమ ఆరోగ్య సమస్యలను తీర్చినందుకు లక్ష్మీదేవిపల్లి మండల ప్రజలు, లబ్ధిదారులు నిర్వాహకులకు, దారా రమేశ్‌కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.







# ప్రభుత్వ నియంత్రిస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు

- విద్య పేరుతో వ్యాపారం.. విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు
- పిడిఎస్ యూ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు కాంపాటి పృథ్వి
- ఫీజుల నియంత్రణ చట్టం చేయాలని సంతకాల సేకరణ
- విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని మద్దతు




భద్రాద్రి కొత్తగూడెం ప్రతినిధి, మే24(నినాదం)

తెలంగాణ రాష్ట్రంలో ప్రైవేట్ విద్యాసంస్థలు విద్యార్థుల నుండి అధిక ఫీజులు వసూలు చేస్తూ విద్యను వ్యాపారంగా మార్చుతున్న నేపథ్యంలో, వెంటనే ఫీజుల నియంత్రణ చట్టాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పిడిఎస్ యూ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, యువత, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని తమ మద్దతు తెలిపారు. విద్య హక్కు అని, పేద మరియు మధ్యతరగతి విద్యార్థులకు అందుబాటులో ఉండేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పాల్గొన్నవారు కోరారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాంపాటి పృథ్వి మాట్లాడుతూ అధికారంలో ఉన్న ప్రభుత్వాలు శ్రీ చైతన్య, నారాయణ విద్యాసంస్థలు ఇచ్చే ఎలక్ట్రోరల్ బాండ్స్‌కు అలవాటు పడ్డాయని, ప్రైవేట్ కార్పొరేట్ విద్యాసంస్థల నుండి కోట్ల రూపాయల ఫండ్స్ వసూలు చేస్తున్నాయని, ఈ క్రమంలోనే ఫీజులను నియంత్రించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ముందుకు రావట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలే ప్రభుత్వాన్ని నియంత్రిస్తున్నాయని అన్నారు, ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు, కళాశాలలు ప్రతి ఏటా ఇష్టారాజ్యంగా 25 నుంచి 50 శాతం ఫీజులు పెంచుతున్నాయని, జిల్లా, ప్రాంతీయ స్థాయిలో ఎంఈఓలు, డిఈ వోలు, ఆర్‌జేడీలు ప్రైవేటు విద్యాసంస్థలకు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు ఇస్తూ ప్రైవేటు విద్యాసంస్థలకు కొమ్ముకాస్తున్నారు అని అన్నారు. ఫీజులు పెంచాలంటే తల్లిదండ్రుల అనుమతి తీసుకోవాలని, భవిష్యత్తులో తల్లిదండ్రులకు, తల్లిదండ్రుల కమిటీలకు చట్టబద్ధమైన హక్కులు కల్పించి, చట్టం చేసి వారి అభిప్రాయాలు సేకరించాకే ఫీజులు పెంచే వెసులుబాటు కల్పించాలన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు ఇష్టారాజ్యంగా ఫీజులు పెంచుతూ తల్లిదండ్రులను తీవ్ర ఆర్థిక భారానికి గురి చేస్తున్నాయని పిడిఎస్ యూ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఫీజుల దోపిడీని అరికట్టేందుకు ప్రత్యేక చట్టం తీసుకురావాలని, ఫీజు నియంత్రణ కమిటీ ఏర్పాటు చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంతకాల సేకరణ ద్వారా ప్రజల అభిప్రాయాలను ప్రభుత్వానికి చేరవేసి, రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని పిడిఎస్ యూ నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పిడిఎస్ యూ జిల్లా అధ్యక్షులు బుర్ర వీరభద్రం, జిల్లా ఉపాధ్యక్షులు సాయి, జిల్లా కమిటీ సభ్యులు శ్రావణ్, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, సామాజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

